# అందమా లేక అనురాగమా?



*భుంక్ష యత్స్వాధీనం*
*కుతో లవణం కుగ్రామరిద్ధే*
*సుభగ సలవణే నాపి*
*కింతేన స్నేహో యత్ర నాస్తి*

*భావం:* అందగాడా, ఉన్నదేదో తిను. చిన్నపల్లెలో లవణ మెక్కడ ఉంటుంది? లవణం (ఉప్పు లేక అందం) ఉన్నప్పటికీ స్నేహం (నూనె లేక మైత్రి) లేకపోతే ఏమిటిప్రయోజనం?

రవాణా సదుపాయాలు ఇప్పుడున్నంతగా లేని రోజులలో ఉప్పు అందరికీ అన్ని సమయాలలో దొరికేది కాదు. సముద్ర తీరాలలో తయారైన ఉప్పు వర్తకులు పడవలలో, బళ్ళపై తెచ్చి పల్లెటూళ్ళలో అమ్మేవారు. అలా దొరికిన ఉప్పును అపురూపంగా దాచుకుని వాడుకునేవారు. మన దేశంలోనే

కాదు ఇంగ్లండులో కూడా ఉప్పు ఎంత అరుదుగా దొరికేదంటే జీతం కింద సాల్ట్ (ఉప్పు)ను ఇచ్చేవారు. శాలరీ (జీతం) అన్నమాట సాల్ట్‌నుంచే పుట్టింది. ఆ విధంగా ఉప్పు తక్కువగా దొరికే రోజులలో ఒక చిన్న పల్లె టూళ్ళో ఒకరింటికి ఒక బాటసారి అతిథిగా వచ్చాడు. హోటళ్లు లేని ఆ రోజులలో బాటసారులకు భోజనం పెట్టడం ఆనవాయితీ. ఇంటి యజమానికీ, బాటసారికీ భోజనం వడ్డించారు.

యజమాని కూతురు కూరవడ్డిస్తూ అతన్ని చూసి 'ఎంత అందంగా ఉన్నాడు. తండ్రి ఇతనితో వివాహ విషయం మాట్లాడితే బాగుండును. కానీ పట్నవాసం వాడిలా ఉన్నాడు. తనలాంటి పల్లెటూరి పిల్ల నచ్చుదేమో' అనుకుంది. కూతురి మనస్సు గ్రహించినట్లుగా ఆమె తండ్రి "అయ్యా మీకు వివాహమైందా" అని ప్రశ్నించాడు. "లేదు. పెళ్ళి చూపులకి అమరావతీనగరం వెడుతున్నాను. అమ్మాయిని మా తల్లిదండ్రులు చూసి రూపవతి అని చెప్పారు." అన్నాడు. ఇక లాభం లేదనుకుందా అమ్మాయి. తనది సామాన్యమైన రూపం. అందరూ అందం చూస్తారు కానీ గుణం చూడరు కదా. బాటసారి యువకుడు "కొంచెం ఉప్పు కావాలి" అన్నాడు. అమ్మాయి వెంటనే "అందగాడా ఉన్నదేదో తిను. పల్లెటూళ్ళో లవణమెక్కడుంటుంది? అయినా లవణమున్నప్పటికీ స్నేహం లేకపోతే ఎందుకు" అని సాభిప్రాయంగా చూసింది. మామూలుగా అందరూ " మా ఇంట్లో ఉప్పులేదు. ఉప్పు కన్నా నూనె ముఖ్యం" అన్న అర్థాన్ని తీసుకుంటారు. కానీ ఆ యువకుడు ఆమె మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించాడు. పల్లెటూరి అమ్మాయిలు అందంగా ఉండకపోవచ్చు. కానీ వారి హృదయంలో ప్రేమ ఉంటుంది. ప్రేమ లేనినాడు అందం ఎందుకు? అతనాలోచించాడు. నిజమే అందం కన్నా ప్రేమ ముఖ్యం. ప్రేమించే ఈ అమ్మాయితోనే తన జీవితం ఆనందంగా గడుస్తుందని అతను ఇంటి యజమానితో వివాహం గురించి మాట్లాడాడు.

అందం కన్నా ప్రేమించే గుణం ముఖ్యమని అందరూ గ్రహించాలి కదా.

******